నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

- వినియోగించుకోవాలి : జుక్కల్ ట్రాన్స్ కో ఏఈ నరేందర్

నవతెలంగాణ-జుక్కల్

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు మద్నూర్ మండలంలోని మేనూర్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ వద్ద నేడు(బుధవారం) నిర్వహించనున్న పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ ట్రాన్స్ కో ఏఈ నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లి నాలుగు మండలాల విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరిష్కార వేదిక కొనసాగనున్నట్టు తెలిపారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

బుధవారం 09 ఆగస్టు 2023

ప్రతివారం కంటి వైద్య శిబిరం



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ సందర్శించారు. ఇక నుంచి ప్రతి మంగళవారం గాంధారి ప్రభుత్వఆస్పత్రిలో కంటి పరీక్షలు చేపడతారని అలాగే మోతిబిందుసమస్య ఉన్నవారికి గుర్తించి లయన్స్ క్లబ్ బోధన్ వారి ఆధ్వర్యంలో ఉచితంగా కంటికి సంబంధించిన ఆపరేషన్లు చేయించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని గాంధారి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మారుమూల గ్రామాల్లో గల పిల్లలకు చదువు.. అందని ద్రాక్షగానే మారుతోంది. కామారెడ్డిజిల్లా మద్నూర్ మండలంలోని ఖరగ్ గ్రామంలోని పాఠశాల రెండు నెలలుగా మూసి ఉండటం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి స్కూల్ తెరుచుకోకవడం గమనార్హం. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు, సర్పంచ్ వాపోతున్నారు. కనీసం తమ పిల్లలను వేరే చోట చదివించుకుందామన్నా.. బస్సులు, ఆటోలు సైతం ఉండని పరిస్థితి అని వాపోతున్నారు. కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అని పాలకులు ప్రచార ఆర్భాటం మాని ఒకసారి మారుమూల పల్లెలను సందర్శించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నవతెలంగాణ, మద్నూర్

బడి బంద్

రెండు నెలలుగా తెరుచుకొని ఖరగ్ పాఠశాల

- విద్యాశాఖ అధికారుల పనితీరుకు నిదర్శనం
- డిప్యూటేషన్ పేర్లతో కాలయాపన
- మా పిల్లల భవిష్యత్తు ఏం కావాలని తల్లిదండ్రుల ఆవేదన
- చిన్నతడ్గుర్‌లో టీచర్ అవతారం ఎత్తిన కార్యదర్శి
- మారుమూల గ్రామాల్లో పర్యవేక్షణ లేక కుంటుపడుతున్న విద్యాబోధన



ఖరగ్‌లో మూసివేసిఉన్న పాఠశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



చిన్నతడ్గూర్‌లో టీచర్ లేకపోవడంతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న జీపీ కార్యదర్శి మాధవరావు

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలో మహారాష్ట్రకు పూర్తిగా సరిహద్దులో గల చిన్నతడు గూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఖరగ్, చిన్న తడగూర్ గ్రామాలను నవతెలంగాణ మంగళ వారం సందర్శించింది. పాఠశాలల విద్యా బోధనపై పరిశీలించగా ఖరగ్ పాఠశాల గత రెండు నెలలుగా మూతపడే ఉంటుందని ఏ ఒక్క ఉపాధ్యాయుడు విద్యా బోధనకు రావడంలేదని ఆ గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా విద్యాబోధనకు నోచుకోవడం లేక ఆ గ్రామ ప్రజలు మా పిల్లల భవిష్యత్తు ఏమి కావాలని ప్రశ్నిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు పంపిద్దామన్నా తమ గ్రామానికి ఆటోలు, బస్సులు రావని దీంతో చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ తెరుచుకోని విషయమై పలుమార్లు విద్యాశాఖా ధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ గ్రామ సర్పంచ్ తెలిపారు. సదరు స్కూల్‌పై కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మద్నూర్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్‌కు వివరణ కోరగా జూలై మాసంలో ఓ ఉపాధ్యాయుడికి ఖరగ్ పాఠశాలకు డిప్యూటేషన్ పంపేందుకు ఆర్డర్ జారీ చేసినట్టు తెలిపారు. అయినా సదరు ఉపాధ్యా యుడు ఇప్పటికీ విధులకు హాజరు కాకున్నా ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. జూన్ నెలలో సైతం ఒక టీచర్‌ను ఒక రోజు మాత్రమే పంపారని, ఈ విషయమై కాంప్లెక్స్ హెడ్మాస్టర్‌ను ప్రశ్నించగా సరైన వివరణ ఇవ్వలేకపోయారు.

టీచర్ అవతారం ఎత్తిన జీపీ కార్యదర్శి

మండలంలోని చిన్న తడుగూరు గ్రామంలో గల పాఠశాలలో బోధించే ఉపాధ్యాయుడిని ట్రెయినింగ్ కోసం మూడు రోజుల క్రితం పంపారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో టీచర్‌లను ఎక్కడికైనా పంపితే ప్రత్యామ్నాయంగా మరో టీచర్‌ను పంపాల్సి ఉంటుంది. కానీ అలా పంపకపోవడంతో ఆ గ్రామపంచాయతీ కార్యదర్శి మాధవరావు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులున్నారు.

మారుమూల మద్నూర్ మండలంలోని గ్రామాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి ఇక్కడి వారికి విద్యావకాశాలు కల్పించాలని కోరుతున్నారు. స్థానిక విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం పట్టింపు లేకపోవడంతో మారుమూల గ్రామాల చదువులు పూర్తిగా కుంటుపడుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభోత్సవాలకు వేళాయే

- నేడు నగరంలో మంత్రి కేటీఆర్ పర్యటన
- ఐటీ హబ్‌తో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, మినిట్యాంక్ బండ్ ప్రారంభించనున్న ఐటీ మున్సిపల్ మినిస్టర్
- ఏర్పాట్లు పరిశీలించిన ఆర్టీసీ చైర్మన్, అర్బన్ ఎమ్మెల్యే, అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

నగరంలో నేడు (బుధవారం) ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పర్యటనకు సర్వం సిద్ధమైంది. ఐటీ హబ్‌తో పాటు మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రారంభించనున్నారు. వీటితో పాటు పలు వైకుంఠదామాలను ప్రారంభోత్సవాలు చేపట్టనున్నారు. మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్త, కలెక్టర్ రాజీవ్ గాంధీ హను మంతు, పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, నగర మేయర్ దండు నీతూకిరణ్, కమిషనర్ ఎం.మకరంద్ లతో కలిసి ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు.



నూతన మున్సిపల్ బిల్డింగ్‌లో పరిశీలన

మొదటగా ఉదయం 11.15 గంటలకు కేటీఆర్ టీ-హబ్‌ను ప్రారంభించ నున్నారు. అనంతరం ఎన్‌ఏసీ సెంటర్‌తో పాటు మున్సిపల్ కార్పోరేషన్ బిల్డింగ్‌ను ప్రారంభించనున్నారు. తదనంతరం మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రారంభోత్సవం చేపట్టనున్నారు. దుబ్బతో పాటు వర్ని రోడ్, అర్సాపల్లిలో అత్యాధునిక హంగులతో నిర్మించిన వైంకుఠదా మాలను ప్రారంభించను న్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు శ్రీరామ గార్డెన్‌లో మున్సిపల్ కార్మికులతో సహపంక్తి భోజనం చేయనున్నారు. తదనంతరం 2.30 గంటలకు పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో తలపెట్టిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్ పై ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.



విద్యుత్‌కాంతులతో వెలుగుతున్న ఐటీ హబ్

హెలికాప్టర్ ద్వారా మంత్రి హాజరవుతుండడంతో, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని హెలిప్యాడ్ ను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా మంత్రి కేటీఆర్ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రతా పరంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. వీరి వెంట ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, జెడ్పిటీసి బాజిరెడ్డి జగన్, అదనపు డీసీపీ జయరాం, ఏ.సి.పి కిరణ్ కుమార్, ఆర్ అండ్ బీ ఎస్.ఈ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మురళీ మనోహర్ రెడ్డి, నగర పాలక సంస్థ ఇంజినీర్ రషీద్, ట్రాన్స్ కో ఏ.డీ.ఈ రాజశేఖర్ ఉన్నారు.



రాత్రి వేళ మినిట్యాంక్ బండ్ వద్ద మిరుమిట్లు

క్షమించండి..

- కాయితీ లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే వ్యాఖ్యలపై ఎమ్మెల్యే జాజాల సురేందర్
- ఆందోళన విరమించిన గిరిజనులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కాయితీ లంబాడాలను గిరిజనుల్లో చేర్చి, వారికి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడటంపై గత కొన్ని రోజులుగా గిరిజనుల సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. అయితే అలా మాట్లాడటంపై ఎమ్మెల్యే సురేందర్ గిరిజనులకు బేషరతుగా క్షమాపణలు చెబుతున్నట్టు ప్రకటించారు.

ఎల్లారెడ్డి పట్టణంలో మంగళవారం ఎల్లారెడ్డినియోజకవర్గ లంబాడీలు సమావేశమై బంజారా భవన్ వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జాజల సురేందర్ నిరసన వ్యక్తం చేస్తున్న వారి దగ్గరకు వచ్చి తాను మాట్లాడిన మాటలకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. దీంతో లంబాడీలు తమ నిరసనను విరమించారు. ఈ సందర్భంగా లంబాడీలు మాట్లాడుతూ ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బంజారా జాక్ కన్వీనర్ మొచిరామ్, ప్రకాష్ నాయక్, అనిల్ నాయక్, ఓంకార్ ఎల్లారెడ్డి నియోజకవర్గ లంబాడీలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సీఐటీయూలో శివాజీ బీడీ కంపెనీ టేకేదారుల చేరిక



సీఐటీయూలో చేరుతున్న వారికి యూనియన్ కండువా కప్పుతున్న చంద్రశేఖర్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామంలో శివాజీ బీడీ కంపెనీకి చెందిన 49 మంది టేకదార్లు తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)లో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రోజుల నుండి టేకేదారులందరూ కంపెనీతో పాటు మేనేజ్మెంట్‌లతో అనేక సమస్యలు ఎదుర్కొంటూ అతి తక్కువ కమిషన్‌తో ఖార్ఖానా నడిపిస్తున్నారని, రాబోయే రోజుల్లో బీడీ టేకర్లందరికి జీవన భృతి తో పాటు ప్రత్యేకమైన జీవో తెస్తూ టే కదారులకు కమిషన్, ఎదుర్కొంటున్న వివిధ సమస్యల మీద పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కర్రోల్ల సత్యం, బిడిటేకాదారులు నరహరి, భూపాల్, లక్ష్మణ్, శేఖర్, సచిన్, శివానందం, రమేష్, నర్సింలు, పోచయ్య, లక్ష్మీపతి, నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-బిచ్కుంద

ప్రభుత్వం విడుదల చేసిన 2023-25 మద్యం దుకాణాల పాలసీకి సంబంధించిన నోటిఫికేషన్ ను ఎక్సైజ్ శాఖ విడుదల చేయగా బిచ్కుంద మండల కేంద్రంలోని రెండు మద్యం దుకాణాలకు తడ్గూర్ గ్రామానికి చెందిన కొండ కృష్ణవేణి గంగాధర్, సోపూర్ గ్రామ సర్పంచ్ కాశీనాథ్ పటేల్ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలోని ఎక్సైజ్ సూపరింటెంట్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ప్రకటన ద్వారా తెలిపారు. బిచ్కుంద ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో 10 మద్యం దుకాణాలకు రెండు దరఖాస్తులు వచ్చాయని, జుక్కల్ గ్రామంలోని షాప్ నంబర్ 43, పిట్లం గ్రామంలోని షాప్ నంబర్ 46 గౌడ సమాజానికి రిజర్వేషన్ కేటాయించగా మిగిలిన 8 దుకాణాలకు ఓపెన్ కేటగిరీ కింద కేటాయించినట్లు జరిగిందని, మద్యం దుకాణాలకు దరఖాస్తు చేయడానికి 21 సంవత్సరాలు పైనున్నవారు అర్హులని తెలిపారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పండి

- లోయలో జరుగుతున్న అమానుష మారణ హోమాన్ని నిరసించాలి
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ.. మానవహారం

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

మణిపూర్ లోయలో జరుగుతున్న అమానుష మారణహెూమాన్ని నిరసించాలని , అక్కడ శాంతిని నెలకొల్పాలని నిజామాబాద్ లో మంగళవారం ప్రజా సంఘాలు ర్యాలీ, మానవహారం నిర్వహించాయి. జన విజ్ఞాన వేదిక, మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ , ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ , వామపక్ష భావాలు గల విద్యార్థి , కార్మిక , మహిళా సంఘాలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నాయి. మనువాదం వద్దు - మానవ వాదం కావాలి , సేవ్ మణిపూర్ - సేవ్ ఇండియా వంటి నినాదా లతో వందమందికి పైగా ప్రజా స్వామ్యవాదులు ర్యాలీలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మానవ హారాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ' మణిపూర్ లో సంఘ్ పరివార్ కు చెందిన మెయితీ మూకల దౌర్జన్యకాండకు పోలీసులు సహకరించారని , అల్లరి మూకలు , పోలీసులు కలిసే కుకీ , నాగా , జో ఆదివాసుల మీద మార ణాయుధాలు వాడారని అన్నారు. ఆదివాసీ స్త్రీల మీద అత్యాచారాలు , హత్యలు , చిత్ర హింసలు, గృహ దహనాలకు పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాలు నిజమైన వార్తలు బయటకు రాకుండా అడ్డుకున్నాయని, ఇంత సిగ్గులేని నీతి నియమాలు లేని ఆధునిక నాగరిక మానవీయ పద్ధతులు తెలియని పాలకులను వ్యవస్థలను సహిస్తున్న భరిస్తున్న మన సమాజం ఎంతగా పతనమై పోయిందో నని ఒక వృద్ధుడు ఆవేదనను వ్యక్తంచేశాడు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల బాధ్యులు రామ్మోహన్‌రావు, ప్రసాద్‌రావు పెద్ది వెంకట్రాములు, శాంతన్, శ్రీధర్, నూర్జహాన్, ఎం.సుధాకర్, రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు మదన్మోహన్, అశోక్, పురుషోత్తం, నర్సింలు, జార్జ్, పెద్దిసూరి, అనిల్, మహేష్, కిరణ్, జ్వాల, ఈవీఎల్ నారాయణ, భోజరావు, ప్రసాద్ రావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని ధర్నా చౌక్ వద్ద మానవహారం

ఐటీఐ కాలేజీ తరలిస్తే ఉద్యమిస్తాం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డిలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కాలేజీని ఇక్కడి నుంచి తరలిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఐటీఐ కాలేజీని పరిశీలించారు. అనంతరం అక్కడున్న విద్యార్థులతో, సిబ్బందితో మాట్లాడి అక్కడున్న సమస్యలను తెలుసుకున్నారు. ఉన్నత అధికారులు స్పందించి ఇక్కడి సమస్యలు పరిష్కరించాలని, ఇక్కడి నుండి కాలేజీని తరలించే ప్రక్రియను మానుకోవాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వడ్డెపల్లి

గడప గడపకు కాంగ్రెస్

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం సుభాష్ రెడ్డి హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న పథకాలపై వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింహులు, ఆఫీజ్, పరందములు, శ్రీనివాస్‌రెడ్డి జనార్దన్ రెడ్డి, నిల రవి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌పై అసమ్మతి గళం

- సమావేశానికి హాజరుకాకుండా ఓ హోటల్‌లో జడ్పీటీసీల మీటింగ్
- అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని కినుకు
- కేటీఆర్ పర్యటన వేళ.. బీఆర్‌ఎస్‌లో అలజడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుపై జడ్పీటీసీలు అసమ్మతి గళం వినిపించారు. మంగళవారం నిర్వహించిన జడ్పీ సమావేశానికి హాజరు కాకుండా.. నగరంలోని ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. నిధులు విడుదల, కేటాయింపులో జడ్పీటీసీలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన 24 మంది జడ్పీటీసీలు సమావేశానికి రాలేదు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి ఒక్కొక్క జడ్పీటీసీ మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. దీంతో కోరం లేక సమావేశం వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు.



సభ్యుల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న సీట్లు

వివరాలు మెయిన్‌లో..

మమ్మల్ని రెగ్యూలర్ చేయండి

- రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయండి
- సీఐటీయూ ఆధ్వర్యంలో రెండో ఏఎన్ఎంల నిరసన



నినాదాలు చేస్తున్న సిబ్బంది, నాయకులు

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-కంఠేశ్వర్

వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న తమను రెగ్యూలర్ చేయాలని, కొత్తగా రిక్రూమెంట్ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రెండో ఏఎన్ఎంలు పోరుబాట పట్టారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 48 గంటల నిరసన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడారు.

నవతెలంగాణ
నిజామాబాద్
2
బుధవారం 09 ఆగస్టు 2023

నర్సరీ, ఇంకుడు గుంతల పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ఉన్న కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నర్సరీ, ఇంకుడు గుంతలను సర్పంచ్ సక్కరం అశోక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల ఆవరణలో ఉపాధి హామీ కూలీలతో నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ కళాశాలలో పచ్చదనం పెంచేందుకు చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల నాటిన మొక్కల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షం నీరు వృధా పోకుండా, నీటి ఒడిసి పట్టేందుకు కళాశాలలో పలు చోట్ల ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ మారుతీ, రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తొలిమెట్టు శిక్షణ

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు గత 6రోజులుగా నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. బోధన్ డివిజన్‌లో గల ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలోని 150 మంది ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు, సాలూర, బోధన్ మండలాల్లోని గణితం ఆంగ్లం, తెలుగు మీడియం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో బోధించే 200ల మంది ఉపాధ్యాయులకు తొలిమెట్టు కార్యక్రమంలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగనాథ్ మాట్లాడుతూ తొలిమెట్టు శిక్షణలో భాగంగా నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో బోధించి విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, సామర్థ్యాల పెంపుదల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కల్దుర్కి కాంప్లెక్స్ హెచ్‌ఎం ఇల్తెపు శంకర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఉచిత విద్య

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన వీఆర్ఏ తూము సుదర్శన్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు దిక్కులేని వారయ్యారని, పెద్ద మనసుతో ఆలోచించి, మండల కేంద్రానికి చెందిన కిడ్స్ పార్క్ పాఠశాల కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్, కొండాపూర్ సర్పంచ్ పోడేండ్ల రమేష్, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ చైర్మన్ అయినాల శ్రీకాంత్ కోరిక మేరకు సుదర్శన్ కుమార్తె అక్షయకు పూర్తి ఉచిత విద్యను అందించనున్నట్లు ఆయన తెలిపారు.అదేవిధంగా ఇంకా ఎవరైనా పేద విద్యార్థులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కరస్పాండెంట్ కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆసిఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తపాల శాఖ ద్వారా జాతీయ జెండాలు

నవతెలంగాణ-బోధన్ టౌన్

భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆజాదికా అమృత్ సర్ కార్యక్రమంలో భాగంగా తపాలా శాఖ ప్రజల వద్దకే జాతీయ జెండా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ జాతీయ జెండాను ప్రజల వద్దకు చేర్చుతున్నారు. బోధన్ తపాల శాఖ కార్యాలయం ఎదుట జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచన్‌పల్లి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ఇంచార్జ్ గైని గంగాధర్ మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పార్టీలో చేరి రెండు సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పీట్ల శ్రీనివాస్, అసెంబ్లీ నాయకులు రామచందర్, నీరడి శంకర్, బర్ల రాములు, రామకృష్ణ, సుభాష్, గోపాల్, మండల నాయకులు నాగభూషన్, కిరణ్, సతీష్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలాల్లో లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలి

నవతెలంగాణ-వర్ని

ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) వర్ని ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఎలక్ట్రీషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సుకి సంబంధించిన సెకండ్ లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్ని ఏరియా కార్యదర్శి లకావత్ గోపాల్, నాయకులు రాము, చిన్న, ఈశ్వర్, సందీప్, నరేష్, శ్రీకాంత్, నాని తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సర్వే

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని రెంజల్, నీలా గ్రామాలలో గ్రామ కార్యదర్శుల బృందం, అంగన్వాడీలు ఆశా కార్యకర్తలతో గ్రామంలోని కుటుంబాల సమగ్ర సర్వేకు మంగళవారం శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలో 1500 కుటుంబాలు, నీల గ్రామంలో 1300 కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సర్వే ప్రారంభించినట్లు గ్రామ కార్యదర్శులు పేర్కొన్నారు. ఈ సర్వేలలో రెంజల్ గ్రామ కార్యదర్శి రాజేందర్ రావు, నీల గ్రామ కార్యదర్శి బి.రాణి ఆధ్వర్యంలో మండలంలోని కార్యదర్శులు శ్రీకాంత్, సిహెచ్.సాయి, మహబూబ్ అలీ, సుమన్, అంగన్వాడీ కార్యకర్తలు సురేఖ, సుజాత, పద్మ, రజిని, రాజశ్రీ, కతిజా, మంజుల, పర్వవ, నజ్మా సుల్తానా, గంగాజమున, బాలహంస సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు క్విట్ ఇండియా ఉద్యమ ప్రాముఖ్యత నేపథ్యంపై జై భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేయనున్నట్టు గ్రామ యూత్ అధ్యక్షులు సాయిరాం పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల చారి, స్కూల్ అసిస్టెంట్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఐటీలో ప్రజ్ఞశ్రీకి సీటు

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని ఎం.సింధుప్రియా బాసర ఐఐఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ లత రాజు మంగళవారం తెలిపారు. తమ పాఠశాలలో విద్యనభ్యసించిన సింధుప్రియా 10.10 జీపీఏ సాధించి ఉత్తీర్ణత సాధించిందన్నారు. అందులో భాగంగా బాసర ఐఐఐటీకీ దరఖాస్తు చేయగా నాలుగో విడత కౌన్సెలింగ్‌లో మంగళవారం విద్యార్థిని ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినికి ప్రత్యేకంగా అభినందించారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-కోటగిరి

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కోటగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడే సంఘం పీఆర్టీయూ అని, ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యార్థుల ప్రగతికి నిరంతరం పోరాటం చేసే సంఘమని వివరించారు. కార్యక్రమంలో కోటగిరి మండల అధ్యక్షులు గంగారాజు, జిల్లా నాయకులు శంకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శానం సాయిలు, మండల కార్యదర్శి కృష్ణమోహనరావు, రాష్ట్ర బాధ్యులు లోల శంకర్, సాయిబాబా, బర్ల సాయిలు, బోధన్ అధ్యక్షులు అంబెలి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నగదు చెల్లింపు

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రెండు పడకల గదుల నిర్మాణంలో అర్హులైన 43 మందికి రూ.70000 చొప్పున నగదు పంపిణీని గృహ నిర్మాణ శాఖ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతీ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ సరిత మారుతి, ఎంపీపీ భర్త వల్లేపల్లి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఏజాస్ ఖాన్ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న సురేందర్‌రెడ్డి

కల్తీకానివి, ఖర్చులేనిది.. తల్లిపాలే

- తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్ : కల్తీ కానివి, ఖర్చులేనిది తల్లిపాలేనని, బిడ్డ పుట్టగానే ముర్రుపాలు పట్టించాలని సిడిపిఓ భార్గవి, ఏసిడిపిఓ జ్యోతి అన్నారు. మంగళవారం పట్టణంలోని మామిడిపల్లి, మండలంలోని సుర్బిర్యాల్ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు పట్టాలని, 7వ నెల నుంచి అదనపు ఆహారం ఇస్తూ రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించాలని తెలిపారు. సామూహిక సీమంతాలు సైతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీదేవి, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

బోధన్ టౌన్ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్‌లోని ధోబిగల్లి అంగన్వాడీ సెంటర్ వద్ద గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించినట్టు శక్కర్ నగర్ సెక్టర్ సూపర్వైజర్ ఆశియా బేగం తెలిపారు. కార్యక్రమంలో బాలింతలు, అంగన్వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, రాణి, తార, ఉషా రాణి, రేణుక, ఉమారాణి, విమల, గీత, రాజేశ్వరి, ఇతరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : మామిడిపల్లిలో గర్భిణులకు సీమంతాలు..

వర్ని(చందూర్) : మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో అంగన్వాడీ సెంటర్లో తల్లిపాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుబాబాయ్, నాగారమణి తదితరులున్నారు.

నవీపేట్: మండలంలోని నారాయణపూర్ గ్రామంలో అంగన్వాడీ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు చాలా శ్రేష్టమైనవని అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించాలని అన్నారు. ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే బిడ్డకు తాగించాలని అన్నారు. అనంతరం సీమంతాలు, అన్న ప్రసనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొంటి లత, కార్యదర్శి మసూద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కోటగిరి : పోతంగల్ మండలంలోని కల్లూరు గ్రామంలో మంగళవారం అంగన్వాడీ సూపర్వైజర్ సుమలత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సుమలత మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రశాంతంగా ధార్మిక చింతనలో ఉండటం ఆరోగ్యం బాగా ఉంటుందని పేర్కొన్నారు. తల్లిపాల విశిష్టత వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు వీరమని, అనురాధ, ఏఎన్ఎం సాయికుమారి పాల్గొన్నారు.

ముర్రు పాలు బిడ్డకు శ్రేష్టమైనవి..

రెంజల్ : పుట్టిన బిడ్డకు ముర్రుపాలెం శ్రేష్టమైనవని, పుట్టిన గంటలోపు ముర్రు పాలను తాగించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, వీరన్నగుట్ట తాండ సర్పంచ్ గణేష్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వీరన్నగుట్ట తండా, నీల, వీరన్నగుట్ట, రెంజల్, కందకుర్తి, గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఇంటిపన్ను గోసను కేటీఆర్ పరిష్కరించాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నాగారం ఇంటి పన్ను గోసను మంత్రి కేటీఆర్ పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. బుధవారం నిజామాబాద్ నగర పర్యటనకు వస్తున్న మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నగరంలోని ఆక్యూపైర్ టాక్సీ, రద్దు చేయబడిన సెల్ఫ్ అసెస్మెంట్ టాక్సీ బాధితుల గోస విని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కమిషనర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ నాగారం ప్రాంతంలో 300 క్వార్టర్స్, 80 క్వాటర్స్, 50 క్వార్టర్స్ పాత నాగారం ప్రాంతంలో గత 35 సంవత్సరాలుగా ఇండ్లు నిర్మించుకొని ఇంటి పన్ను చెల్లిస్తున్నారని, మ్యానువల్ టాక్స్ వసూలు చేసినప్పుడు పేర్లతో రసీదులు ఇచ్చినప్పటికీ, ఆన్లైన్ సిస్టం వచ్చిన తర్వాత ఆక్యుపేర్ క్రింద మార్చివేసి మున్సిపల్ అధికారులు తీరని అన్యాయం చేశారని అన్నారు. ఆక్యుపేర్ స్థానంలో, పేర్లతో అసెస్మెంట్ ఇంటి పన్ను వసూలు చేయాలని 10 ఏళ్లుగా అనేకమార్లు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం సెల్ఫ్ అసెస్మెంట్ టాక్సీల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో 100 గజాలలోపు అనేకమంది నిరుపేదలు ఇంటి పన్ను చెల్లించి, సెల్ఫ్ అసెస్మెంట్ పొందినప్పటికీ అనేక కారణాలు చెబుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో రద్దు చేశారని అన్నారు. ఈ వ్యవహారంలో అవినీతికి పాల్పడిన వారిని వదిలివేసి నిరుపేదలను శిక్షించడం వాటిని రద్దు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. నేడు జరగబోయే బహిరంగ సభలో సంబంధిత మంత్రి నిజామాబాద్ నగర ప్రజల ఆక్యుపేర్ టాక్సీ సమస్యలను, సెల్ఫ్ అసెస్మెంట్ టాక్స్ పునరుద్ధరణ అంశాలపై స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి బెజగం సుజాత, సీఐటీయూ నగర కో కన్వీనర్ కటారి రాములు, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ధ్యారంగుల కృష్ణ, 300 క్వార్టర్స్ వాసులు రాజమణి, స్వరూప, పుష్ప, హేమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని సంజీవయ్య కాలనీకి చెందిన సెల్వాజి నవీన్ కుమార్(33) నిజామాబాద్ జి.జి. కాలేజ్‌లో ఆఫీస్ సబార్డినేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను గత కొన్ని రోజులుగా కాళ్ల నొప్పితో బాధపడుతూ తరుచుగా డ్యూటీకి వెళ్లేవాడు కాదు. అయితే అతని ఆరోగ్య సమస్యల పట్ల బాధపడుతూ కొన్ని ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. కాగా సోమవారం ఉదయం 9:30 గంటలకు గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ్లి వస్తా అని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని గురించి కుటుంబ సభ్యులు అంతట వెతకగా మంగళవారం ఉదయం ఖానాపూర్ గ్రామ శివారులో ఏటీఎస్ టవర్ ఎక్కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంలో నవీన్‌కుమార్ భార్య రమ్యకృష్ణ ఫిర్యాదు మేరకు నిజామాబాద్ రూరల్ ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి గుంటలో పడి రైతు మృతి

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని కోటార్మూర్ గ్రామానికి చెందిన రైతు ఇట్టేడి సంజయ్ రెడ్డి (32) కోటార్మూర్ రైల్వే బ్రిడ్జి కింద రోజువారీగా వ్యవసాయ పనులకు వెళ్లిన సంజయ్ మంగళవారం నీటి గుంటలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకస్మాత్తుగా ఇటీవల భారీగా కురిసిన వర్షం వల్ల రైల్వే బ్రిడ్జి కింద కెనాల్లోకి వరద నీరు రావడంతో గుంతలుగా మారాయి. వాటిని గమనించక ఎప్పుడు వెళ్లే విధంగా వ్యవసాయ పనికి వెళ్లాడు. అక్కడ ఉన్న గుంతలు గమనించక అందులో పడిపోయిన సంజయ్‌ను స్థానికులు గమనించి బయటికి తీశారు. అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందజేయగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఘటన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించినట్టు సీఐ సురేష్ బాబు తెలిపారు. సంజయ్‌రెడ్డికి భార్య కుమార్తె ఉన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

2023-25 మద్యం దుకాణాల పాలసీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎక్సైజ్ శాఖ విడుదల చేసినందున నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 35 మద్యం దుకాణాలకు ఆసక్తి కల ఆశావాహులు దరఖాస్తు చేసుకోవాలని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నిజామాబాద్ బి.దిలీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ పట్టణంలోని గెజిట్ నంబర్ 20కి ఎస్టీ రిజర్వేషన్, గెజిట్ నంబర్ 3, 8కి ఎస్సీ రిజర్వేషన్, గెజిట్ నంబర్ 11కు గౌడ్ రిజర్వేషన్, నందిపేట్‌లోని గెజిట్ నంబర్ 28,29,30కి ఎస్సీ రిజర్వేషన్, కేటాయించగా మిగిలిన 28 దుకాణాలకు ఓపెన్ కేటగిరీ కింద కేటాయించినట్లు తెలిపారు.

ఆర్మూర్ : ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 26 మద్యం దుకాణాలకు ఆసక్తిగలవారు దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ మంగళవారం తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని గెజిట్ నంబర్ 54కు ఎస్టీ రిజర్వేషన్, గెజిట్ నంబర్ 57,58,61కు ఎస్సీరిజర్వేషన్, గెజిట్ నంబర్ 62కు గౌడ్ రిజర్వేషన్, గెజిట్ నంబర్ 63 పిప్రి గ్రామంకు గౌడ్ రిజర్వేషన్, గెజిట్ నంబర్ 68 షాప్ నంబర్ 03 బాల్కొండ గౌడ్ రిజర్వేషన్, గెజిట్ నంబర్ 73 షాప్ నంబర్ 03 జక్రాన్‌పల్లి గౌడ్ రిజర్వేషన్, గెజిట్ నంబర్ 77 మెండోరా గ్రామానికి గౌడ్ రిజర్వేషన్ కేటాయించగా..

మిగిలిన 17 దుకాణాలకు ఓపెన్ కేటగిరీ కింద కేటాయించినట్లు తెలిపారు. దీనికై దరఖాస్తు చేయడానికి 21 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ అర్హులని, రూ.2 లక్షలు డీడీ లేదా చలానా తీసి జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి, నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేయాలని, ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక వ్యక్తి ఒక దుకాణానికి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని, దరఖాస్తు ఫారంతో పాటు, 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, స్వీయ ధృవీకరణతో కూడిన ఆధార్, పాన్ కార్డ్ జిరాక్స్ కాపీలు, రిజర్వ్ అయిన దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వారు కుల ధృవీకరణ పత్రాలను అందచేసి చివరి తేదీ 18లోగా జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెంత్, ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘువాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహిణులు, మధ్యలో చదువు మానేసిన వారు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఇందుకు పూర్తి వివరాల కోసం పాఠశాలలో గానీ 9948 455704, 9949585065 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

16 నుంచి బీఈడీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ 4వ సెమిస్టర్ (రెగ్యులర్), ఒకటి, రెండు, మూడు, నాలుగవ సెమిస్టర్ (బ్యాక్ లాక్) పరీక్షలు ఆగస్టు 16 నుంచి 26 వరకు జరుగుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలలకు చెందిన విద్యార్థులు గమనించాలని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూసుకోవాలని కోరారు.

నేటి నుంచి 'మేరా మట్టి మేరా దేశ్'

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆదేశాల మేరకు తెలంగాణ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మేరా మట్టి మేరా దేశ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సమన్వయ కర్త డా.రవీందర్‌రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 9 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు ఆజాద్‌కి అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 75 మొక్కలను నాటనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం

నవతెలంగాణ-మోర్తాడ్

సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలు, దొంగతనాలు జరగకుండా ఉంటాయని ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చంద్ర, సర్పంచ్ ధరణి సంయుక్తంగా ప్రారంభించారు. మండల కేంద్రంలోని తక్కురివాడా కాలనీలో కాలనీవాసులు రూ.2లక్షల నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. హైదరాబాద్ మూడు కమిషనరేట్ పరిధిలోని 10 లక్షల కెమెరాలతో నిఘా వ్యవస్థ ఎప్పటికప్పుడు కొనసాగుతుందని సీసీ కెమెరాల ద్వారా నేరస్తులను పట్టుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మోర్తాడ్ ఎస్సై అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు రక్తహీనత లేకుండా చూడాలి

- మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ.. గర్భిణులకు రక్తహీనత లేకుండా చూడాలని అన్నారు. గర్భిణులకు తప్పకుండా 180 ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, 180 క్యాల్షియం మాత్రలు వేయాలని తెలిపారు. వారికి రక్తహీనత కలగకుండా బెల్లం పట్టీలు, మునగ ఆకు, క్యారెట్, ఆకుకూరలు తినాలని సూచించారు. కౌమారదశలో గల బాలికలకు రక్తహీనత లేకుండా చూడాలని వారికి దాని ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. కండ్ల కలక అంటువ్యాధి గురించి ఇంటింటికీ తిరిగి ప్రజలలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వివరించారు. తల్లిపాల వారోత్సవాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఎం.ఎల్.ఎచ్.పి.ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాణిక్ భవన్ పాఠశాలలో 1969-70 సంవత్సరం పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని 53 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కుటుంబ సభ్యులతో సహా స్థానిక లహరి హోటల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులు చెప్పిన చదువు సంస్కారమే మన జీవితాలు స్థిరపడటానికి దోహదపడ్డాయని గురువులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ముఖ్య ప్రోత్సాహకుడు నర్సారెడ్డిని, అదేవిధంగా మెమొంటోలు అందజేసిన సురేందర్‌రెడ్డిని అందరూ కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరి దయానంద్ గుప్త, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ రవికిరణ్‌రావు, ప్రముఖ వాణిజ్య వేత్తలు నవీన్‌రెడ్డి, సురేష్, రాజాశంకర్, శ్రీహరి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు, ప్రజలతో మంత్రి కేటీఆర్ మాట్లాడాలి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగర పర్యటనకు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వస్తున్న సందర్భంగా మున్సిపల్ కార్మికులతో, నగర ప్రజలతో మాట్లాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. కోటగల్లిలోని శ్రామికభవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా నాయకులు కె.రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు సమస్యల స్వాగతం : టీడీపీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్‌కు వస్తున్న మంత్రి కేటీఆర్‌కు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి తాను వచ్చే దారి కాకుండా, నిజామాబాద్ గల్లీల్లో తిరిగితే నిజామాబాద్ రోడ్లు ఎలా ఉన్నాయో తెలుస్తదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు.

'బొడ్డెమ్మ చెరువు ఎమ్మెల్యేకు ఏటీఎంల తయారైంది'

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బొడ్డెమ్మ చెరువు ఎమ్మెల్యే బిగాలకు ఏటీఎంల తయారైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం ఐటీ హబ్‌కు మంత్రి కేటీఆర్ భూమిపూజ చేసి 18 నెలల్లో పూర్తి చేస్తానని చెప్పి.. ఐదేండ్ల తర్వాత ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిటి స్రవంతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మీనారాయణ, అసెంబ్లీ కోకన్వీనర్ నారాయణ యాదవ్, కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, సుక్క మధు, ఇప్పకాయల కిషోర్, బూర్గుల వినోద్, ఇల్లందుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జ్ తరుణ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. తెలంగాణ యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తరుణ్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్థానిక సర్పంచ్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. మాక్లూర్ గ్రామంలో ఏడుగురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, మండల కోఆప్షన్‌మెంబర్ కొక హైమ్మద్, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులను సన్మానించిన పోచారం

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడలోని తన నివాసంలో ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు చైనా దేశంలో జరగనున్న జూనియర్ సాఫ్ట్ బాల్ (అండర్-18) ఏషియన్ చాంపియన్షిప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న స్పీకర్

మురుగు కాలువలో పసికందు

నవతెలంగాణ-బోధన్ టౌన్

అప్పుడే పుట్టిన మగ శిశువును మురికి కాలువలో పడేశారు. మృతిచెందడంతో పడేశారా..? లేకుంటే బిడ్డను వద్దను వదిలించుకున్నారా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ హృదయ విదారక ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఉద్మీర్ గల్లీలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ఘటన పట్ల పోలీసులు విచారణ చేపట్టారు. ఇప్పటి వరకు ఎవరూ వచ్చి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


డ్రయినేజీలో మృతిచెందిన శిశువు

భయంతో కాదు..
భక్తితోనే కేసీఆర్‌ను పోటీచేయమన్నా

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి
- బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి సంక్షేమం ఎక్కడా లేదు
- విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-రాజంపేట్

'సీఎం కేసీఆర్ పుట్టిన ఊరు బీబీపేట్ మండలంలోని కోనాపూర్ గ్రామం. సీఎం సొంతూరు కాబటి ఇక్కడి నుంచి పోటీ చేయాలని గత మూడు పర్యాయాలుగా అడుతున్నా తప్పా.. నేనోదో ఓడిపోతానని కాదని' విప్ గంపగోవర్ధన్ అన్నారు. తాము చేపట్టిన పనులతో ఇప్పటి వరకు ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనట్టు గుర్తు చేశారు. ప్రజల ఆశీర్వాదం ఉంది కాబట్టి మరోసారి సైతం గెలుస్తానని అన్నారు.

రాజంపేట్ మండలంలోని ఆరేపల్లి గ్రామంలో మంగళవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన, అభివృద్ధి పనులు ప్రారంభించారు. గ్రామంలోని పుర వీధుల గుండా పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో


పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న విప్ గంపగోవర్ధన్

ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే గ్రామాలను అభివృద్ధి చేస్తుందని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలను అందజేస్తుందని తెలిపారు. భారతదేశంలో 28 రాష్ట్రాల్లో మన రాష్ట్ర ప్రభుత్వమే బీడీ కార్మికులకు పెన్షన్ అందజేస్తుందని ఆయన తెలిపారు. ఆరేపల్లి గ్రామంలోనే సంవత్సరంలో 50 లక్షల పెన్షన్లు అందిస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం కింద సంవత్సరానికి 10,000 చొప్పున అదేవిధంగా రైతు బీమా కింద ఐదు లక్షలు అందజేస్తుందని రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వమే అందజేస్తుందని బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఏడు గంటలు మాత్రమే విద్యుత్తును అందిస్తుందని ఆయన వివరించారు. ఆరేపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ నిర్మాణానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేసినట్టు తెలిపారు.

ఈసారి కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్‌ను నిలబడాలని తానే మూడుసార్లు చెప్పినట్టు ఆయన తెలిపారు. సీఎం కేసీఆర్ జన్మస్థలం బీబీపేట్ మండలం కోనాపూర్ గ్రామం అని ఆయన తెలిపారు. ఇది ఆసరాగా తీసుకుని కొన్ని పార్టీలు తాను గెలువను అనే నమ్మకం లేకపోవడంతోనే సీఎం కేసీఆర్ను బరిలోకి దించుతున్నారని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతి ఎన్నికల సమయంలోనూ ఇలానే ప్రచారం చేస్తున్నారని అన్నారు. కానీ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని మరోసారి జెండా ఎగురవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్ము యాదగిరి, ఎంపీపీ లింగాల స్వరూప, జడ్పీటీసీ కొండా హనుమాన్లు, బిక్నూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హనుమంత్ రెడ్డి, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు బిక్కాజి బల్వంత్ రావు, పిఎసిఎస్ ఛైర్మన్ నల్లవెల్లి అశోక్, సీనియర్ నాయకులు జూకంటి మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కమలాకర్రావు, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మాణిక్యం, భూమ్ రావు, రాజేందర్ రావ్, వెంకట్రావు, భాస్కర్ నాయకులు కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో నిప్పంటించుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం

- ఫిర్యాదు చేస్తే.. తననే కొట్టారని ఆవేదన


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని 5వ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యయత్నం చేశాడు. 50 శాతం కాలిన గాయాలు కావడంతో హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, కుటుంబీకుల వివరాల ప్రకారం.. ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం వడ్డెర కాలనీకి చెందిన అలకొండ రాజుకు అతని భార్యకు సోమవారం గొడవ జరిగింది. దాంతో రాజు డయల్ 100 ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. రాత్రి ఆలకుంట రాజు ఇంటికి వెళ్లిన ఒక కానిస్టేబుల్ అతన్ని చితకబాదినట్టు బాధితుని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనపై పోలీసులు ఎందుకు దాడి చేశారో చెప్పాలని ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా స్టేషన్‌లో ఎస్ఐ లేడని, మంత్రి పర్యటన బందోబస్తుకు వెళ్లారని చెప్పడంతో స్టేషన్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. సాయంత్రం వేళ పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఆలకుంట రాజు తనకు పోలీసుల ద్వారా న్యాయం జరగదని భార్య ద్వారా తనపైనే కేసులు పెట్టేందుకు యత్ని స్తున్నారని మనస్థాపం చెంది పోలీస్ స్టేషన్ లో నే ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యయత్నం చేసినట్టు బాధితులు తెలిపారు. పోలీసు అధికారులు మాత్రం దానిని ఖండిస్తున్నారు. పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాలు రికార్డు గురించి అడిగితే రికార్డు కాలేదని తెలపడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన గంగాసాగర్‌ను పెద్ద ఎడ్గి సర్పంచ్ అస్పత్ వార్ వినోద్, మాజీ ఎంపిటిసి ఇమ్రాన్ ఖాన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించి శాలువాతో సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా కలిసి విన్నవించుకోవాలని సూచించారు.

పశువులకు గాలికుంటు నివారణా టీకాలు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలంలోని కుప్రియాల్ గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఆవులు, ఎద్దులు(95), 208 గేదెలకు వేసినట్టు మండల పశువైద్యాధికారి డా.ఆర్ రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, విజయ డెయిరీ అధ్యక్షులు బాణాల రాజిరెడ్డి, సెక్రెటరీ నారాయణ, విశ్రాంత పశుగణ అధికారి శివయ్య, పశుగణ సహాయకులు డి.జుగల్ కిషోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐని సన్మానించిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-జుక్కల్


ఎస్ఐని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

జుక్కల్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సత్య నారాయణను మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతి నిధులు మంగళ వారం సన్మానించారు. అదే విధంగా మహమ్మదాబాద్ సర్పంచ్ సాయిలు ఆధ్వర్యంలో గ్రామస్తులు, వార్డు సభ్యులు కలిసి ఎస్సైని సన్మానించారు. సమస్యలపై ప్రజలు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయొచ్చని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో నరేష్, ఆర్ఐ రామ్ పటేల్, సర్పంచులు మహమ్మదాబాద్ సాయిలు, నాగల్ గావ్ కపిల్, బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, సదుపటేల్, శివాజీపటేల్, మహమ్మదాబాద్ లక్షెట్టి రామన్న తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో గల టీచర్స్ కాలనీ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం తల్లి ముర్రిపాల ప్రాముఖ్యతపై అంగన్వాడీ టీచర్లు చంపాబాయి కళావతి ఆయా సెంటర్ల పరిధిలోని గర్భిణులకు కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిముర్రుపాలు పట్టించడం వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి కలుగుతుందని, బిడ్డఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఇక్బాల్, ఆయా సెంటర్ల టీచర్లు సెంటర్ల పరిధిలోని తల్లులు గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రయివేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో నిబంధనలు పాటించని ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యాశాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రైవేట్ స్కూళ్లలో అర్హులైన అధ్యాపకులతో విద్యా బోధన చేపడుటలేరని,కేవలం ఇంటర్,డిగ్రీ పాస్ పేయిల్ అయినా వారితోనే విద్యాబోధన కొనసాగిస్తున్నారని అన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-తాడ్వాయి


సమ్మెశిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 34 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. తమను రెగ్యులరైజ్ చేయాలని,పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నామన్నారు.సమ్మె 34వ రోజుకు చేరుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదన్నారు.

14న ఎల్లారెడ్డికి కేటీఆర్ రాక


చిల్డ్రన్‌పార్క్‌ను సందర్శించి వ్యాయామ పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కు పురపాలక ,ఐ టి మంత్రి వర్యులు కె తారకరామారావు ఈ నెల 14 న ఎల్లారెడ్డి కి వస్తున్నట్లు ఎమ్మెల్యే జాజల సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణంలోని జీవాదన్ స్కూల్ పక్కన ప్రాతంలో సభ జరగాల్సిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి రాక వాళ్ల చేయాల్సిన పనులపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.

చిల్డ్రన్ పార్క్ పనుల పరిశీలన

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని చిల్డ్రన్ పార్కు ను మంగళవారం ఎమ్మెల్యే జాజల సురేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి ప్రజల చిరకాల కోరిక ఆయన చిల్డ్రన్ పార్క్ పనులు త్వరగా పూర్తి చేయటం చాలా సంతోష కరమని అని తెలిపారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న బస్ స్టాండ్ పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఏ ఎం సి ఛైర్మన్ కాశి నారాయణ, కౌన్సిలర్లు నీల కంఠం, బుంగరి రాము, సొసైటీ ఛైర్మన్ ఎగుల నర్సింహులు,బిఆరెస్ నాయకులు జలందర్ రెడ్డి, అధిములం సతీష్, బుంగరి రాము, నునుగొండ శ్రీను , ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ రిలే దీక్షకు మద్దతు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో తల్లి తెలంగాణ ప్రాంగణంలో అన్నసాగర్ ఎంపీటీసీ ఉమాదేవి గురుప్రతాప్ చేపడుతున్న రిలే నిరాహారదీక్ష కు మంగళవారం ఎల్లారెడ్డి బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ నేటికి పదమూడు రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వం వెంటనే స్పందించి అన్నసాగర్ ఎంపీటీసీ చేస్తున్న డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాహుజన సమాజ్ పార్టీ ఎల్లారెడ్డి పట్టాణ కమిటీ అదక్ష్యులు మార్ల సాయిబాబు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రగతి పనులు పరిశీలన

నవతెలంగాణ-మద్నూర్


కంపోస్టుషెడ్డు పరిశీలిస్తున్న అధికారులు

మండలంలోని హెచ్ కేలూర్ గ్రామాన్ని మంగళవారం మండల అభివృద్ధి అధికారి రవి ఈశ్వర్ గౌడ్ సందర్శించి పల్లె ప్రగతి అభివృద్ధి పనుల్లో భాగంగా పల్లె పకృతి వనం స్మశాన వాటిక కంపోస్ట్ షెడ్డు పరిశీలించారు. హెచ్ కెలూరులో చేపట్టిన పల్లె ప్రగతి అభివృద్ధి పనులపై ఎంపీడీవో ఆ గ్రామ సర్పంచ్ నీలావతి హనుమాన్లుతో మాట్లాడుతూ అభివృద్ధి పనులు బాగానే ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట నాయకులు బి హనుమాన్లు, హెచ్ కేలూర్ గ్రామ కార్యదర్శి రాములు, సలాబత్పూర్ గ్రామ కార్యదర్శి రవికుమార్, అంతాపూర్ గ్రామ కార్యదర్శి ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

నవతెలంగాణ-సదాశివనగర్


దోమలమందు పిచికారి పరిశీలన

సదాశివనగర్ మండల కేంద్రంలో మంగళవారం పిచికారీ చేసినట్లు సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వర్ష కాలంలో దోమల వ్యాప్తితో డెంగ్యూ, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా గ్రామంలోని ప్రతి వీధిలో దోమల మందు పిచికారి చేసినట్లు తెలిపారు.

ఫిజియోథెరపీ శిబిరం

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని భవిత ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు డాక్టర్ సారిక ఫిజియోథెరపీ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ సారిక మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ దివ్యాంగ పిల్లలకు ప్రతి రోజు వ్యాయామం చేయించాలని సూచించారు. ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు వినియోగించుకోవాలని మండల విద్యాధికారి సేవ్లా అన్నారు. ఈ క్యాంపులో మొత్తం ఎనిమిది మంది పిల్లలు పాల్గొన్నారని రిసోర్స్ టీచర్స్ పెంటయ్య సాయన్న తెలిపారు.

వ్యవసాయ గణన సజావుగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

వ్యవసాయ గణన సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయాధికారులకు సూచించారు. మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ గణన 2021-22 పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ నెల 28 వరకు వ్యవసాయ గణన పూర్తి చేయాలని సూచించారు. మొదటిసారిగా సాంకేతికతను వినియోగించి ఖచ్చితమైన సమాచారం సేకరించేందుకు జిల్లా ప్రణాళిక, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సర్వే చేపట్టామన్నారు. ఏ.ఈ.ఓ.లు క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన వివరాలు సేకరించాలని సూచించారు. ధరణి పోర్టల్ ఆధారంగా రైతుల సమగ్ర సమాచారం సేకరించాలని తెలిపారు. రైతుల జీవన స్థితిగతులు, సాగు పంటల స్వరూప స్వభావాన్ని వ్యవసాయ గణన ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

అగ్రి సెన్సెస్ పేరిట ప్రత్యేకంగా మొబైల్ యాప్ ను రూపొందించారని, దానిని ఏ.ఈ.ఓ. లు డౌన్ లోడ్ చేసుకొని గణన పూర్తి చేయాలన్నారు. మూడు దశలలో గణన చేయవలసిన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు ఏఈఓ లకు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర గణాంక శాఖ సహాయ సంచాలకులు శ్రీవల్లి, డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారులు పూరి రాజు, సుధ,, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి రాజా రామ్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యయసాయ అధికారులు, ఏ.ఈ.ఓ.లు, మండల గణాంకాధికారులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయండి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా..
- నల్లబ్యాడ్జీలతో నిరసన


నిజామాబాద్‌లో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్/పిట్లం

తమను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రెండో ఏఎన్ఎంలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ యూనియన్ జిల్లా నాయకురాలు విక్టోరియా మాట్లాడారు. పోస్టుల భర్తీ కోసం వైద్యశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి రెండో ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

పిట్లం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ముందు 2 వ ఏఎన్ఎంలు నల్ల బ్యాడ్జీలతో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 4న తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కార నిమిత్తం చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం 3 వేల 2వ ఏఎన్ఎం లను అకారణంగా అరెస్టు చేసిందని తెలిపారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని , లేనిపక్షంలో తమ పోరాటమును ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుశీల , స్వాతి , రాజేశ్వరి , లక్ష్మి , అంబికా , స్వప్న , వసంత , ముజాహిదా , చంద్రకళ , అంజలి తదితరులు పాల్గొన్నారు.


పిట్లంలో నల్లబ్యాడ్జీలతో నిరసన

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-సదాశివనగర్/లింగంపేట్/ఎల్లారెడ్డి


సదాశివనగర్ తహసీల్దార్ హిమబిందు

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆయా మండలాల తహసీల్దార్‌లు మంగళవారం తెలిపారు. మహిళా పేరు మీద డాక్యుమెంట్, ఆధార్ కార్డు, కులం ధృవీకరణపత్రం, పాస్‌ఫోటో సైజ్, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్స్‌లతో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సదాశివనగర్ తహసీల్దార్ హిమబిందు తెలిపారు.

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నిరుపేదలు గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని లింగంపేట మండలం ఎమ్మార్వో చంద్ర రాజేశ్వర్ పత్రికలకు విడుదలచిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గృహ లక్ష్మీ దరఖాస్తు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీవన్ తెలిపారు. ఈ నెల 10వ తేదీతో గడువు ముగియనుందని, అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్.ఆర్.భవన్‌లో నిర్వహించారు. ముందుగా ప్రజాయుద్ధనౌక గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సమావేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతాంగ సమస్యల పరిష్కారానికి పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, నాయక్‌వాడి నరసయ్య, జిల్లా ఉపాధ్యక్షులు, ఎల్.పర్వయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తడకల కృష్ణగౌడ్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు గోపాల్, చిన్నయ్య బాబురావు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అధికారి వేధిస్తుండు..

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


భార్యాపిల్లలతో కలిసి నిరసన చేపట్టిన యాదగిరి

నాగిరెడ్డిపేట్ మండలం విద్యుత్ ఏఈ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అక్కడ ఎలక్ట్రికల్ క్యాజువల్ లేబర్‌గా పని చేస్తున్న బోయిని యాదగిరి మంగళవారం ఎల్లారెడ్డి విద్యుత్ డిఈకి వినతిపత్రం అందజేశారు. కుటుంబీకులతో కలిసి కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశాడు. స్పందించిన డీఈ గణేశ్ మాట్లాడుతూ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-లింగంపేట్

సిపిఎస్ అంతం కోసం తలపెట్టిన ఛలో హైదరాబాద్ పోస్టర్‌ల ను లింగంపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ వారం ఆవిష్కరిం చినట్టు జిల్లా అధ్యక్షులు ఎల్లారెడ్డి తెలిపారు. సిపిఎస్ రద్దుకు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎస్ సిపిఎస్ఈ యూ ప్రధాన కార్యదర్శి బాణాల భాస్కర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ధారావత్ బాల్ సింగ్, మోహన్, ప్రవీణ్ రాష్ట్ర బాధ్యులు సురేష్,మండల అధ్యక్షులు సంతోష్ ప్రధాన కార్యదర్శి దామోదర్ పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరు : ఎమ్మెల్యే షకీల్

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలోని నవీపేట్ మండలం నిజాంపూర్ నుంచి నాళేశ్వర్ వరకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.45 కోట్లు నిధులు మంజూరు చేసిందని, అలాగే రెంజల్ మండలంలోని రెంజల్ నుండి దూపల్లి గ్రామం వరకు రూ.3.45 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే షకీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెంజల్ నుంచి దూపల్లి వరకు గల బీటీ రోడ్డు గత 4 సవంత్సరాల క్రితం మంజూరు కావడమే కాకుండా పనులు కూడా ప్రారంభించామని, అనివార్య కారణాల వలన గుత్తెదారుని మార్చడం, అదే సమయంలో కరోనా రావడంతో 2 సంవత్సరాలు పనులు నిలిచిపోయాయని పేర్కోన్నారు. గత కొన్ని రోజుల నుండి నిలిచిపోయిన రెంజల్ నుంచి దూపల్లి వరకు గల బీటీ రోడ్డు మంజూరు చేయాలని ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కి, పంచాయతీరాజ్ మంత్రికి ప్రతిపాదనలు సమర్పించడంతో ఆ పనులకు నిధులు మంజూరయ్యాయని, కొంతమంది కావాలని విమర్శలు చేస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని ఎమ్మెల్యే ప్రజలకు కోరారు.

మంత్రి రాక.. గుంత పూడ్చివేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నగరంలోని ఎల్లమ్మగుట్ట నుంచి పులాంగ్ వెళ్లే రోడ్డు మధ్యలో గల ప్రగతినగర్ మున్నూరు కాపు కమాన్ వద్ద గుంతపడింది. నెల రోజులైనా దానిని పూడ్చని అధికారులు బుధవారం మంత్రి కేటీఆర్ పర్యటన ఉండటంతో ముందుగానే పూడ్చారు. నెలరోజుల్లో పూడ్చని గుంతను.. కేవలం మంత్రి పర్యటనతో పూడ్చారని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-సిరికొండ



నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జి.రమేష్‌ను చిన్నవాల్గొట్ గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మంగళవారం శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సంఘం అధ్యక్షు లు పులి రాము మాట్లాడుతూ.. తమ యువజన సంఘం తరపున ఎల్లవేళలా పోలీసు శాఖకు సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పులి శ్రీ కుమార్, జాన్సన్, బిట్టు, విజయ్, సుశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మాదిగ సంఘానికి రూ.7.50లక్షల ప్రోసిడింగ్ ఆర్డర్స్ పత్రాలను మంగళవారం ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పంపిణీ చేశారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాల నిర్మాణం కోసం ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తన ఎస్‌సీడీడీ నిధుల నుంచి రూ.7.50 లక్షలను మంజూరు చేయించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చింత శ్రీనివాస్‌రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మణిపూర్‌లో మహిళలను లైంగికదాడి చేసి ఊరేగింపు చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని సైదాబాద్ షాదీఖానాలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నిర్వహించిన సదస్సులో సబ్ డివిజన్ కార్యదర్శి సూర్యశివాజీ అధ్యక్షతన మంగళవారం సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తలు మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలను లైంగికదాడి చేసి ఊరేగింపు నిర్వహించిన దుండగులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు, సీపీఐ(ఎం) నాయకులు కుతాడి ఎల్లయ్య, మర్కజ్ కమిటీ చైర్మన్ మొయినుద్దీన్, ఎంఐఎం కౌన్సిలర్ జహీర్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి చిట్టక్క, అరుణోదయ జిల్లా కార్యదర్శి అబ్దుల్, పార్టీ డివిజన్ నాయకులు ఖాజా మొయినుద్దీన్, ఎస్.రవి, పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్ పాల్గొన్నారు.

రోగులు ఉన్నా.. డాక్టర్లు లేరు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఉదయం 11:30 గంటలకే రోగులు వచ్చినా.. డ్యూటీ డాక్టర్లు లేరని, పేద ప్రజలు ఎవరిని సంప్రదించాలో తెలియక ఆందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని బోధన్ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ బాబు తెలిపారు. ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలవగా సరైన సమాధానం ఇవ్వలేదని వివరించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-కోటగిరి

సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని ఆ ఉద్యోగులు మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో ఇంచార్జి తహసీల్దార్ ఆజీజ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలని, 365 రోజులు శ్రమిస్తున్నప్పటికీ చాలీచాలని జీతాలతో జీవితాలు నెట్టుకొస్తున్నామని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భూపేందర్, రాజేష్, మహేష్, నిర్మల, పద్మ, సావిత్రి పాల్గొన్నారు.

బాజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీవో

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ జిల్లా ఆర్డీవోగా రాజేంద్ర కుమార్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు డిచ్‌పల్లి మండల ఎమ్మార్వోగా బాధ్యతలు చేపట్టిన రాజేందర్ కూడా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కండ్ల కలకపై అవగాహన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కండ్ల కలక అంటువ్యాధిపై విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన కలిగి ఉండాలని వై.శంకర్ అన్నారు. మంగళవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో కండ్ల కలక అంటువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వర్ష, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మార్వో, ఎస్సైలకు సన్మానం

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాలేశ్వర్ గ్రామంలో బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు స్వగృహంలో ఎమ్మార్వో ధన్వల్, ఎస్సై యాదగిరి గౌడ్‌ను శాలువాలతో మంగళవారం సన్మానించారు. గ్రామానికి విచ్చేసిన సందర్భంగా మర్యాద పూర్వకంగా సత్కరించి గ్రామంలోని పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్ఐ మోహన్, వీఆర్వోలు నరేష్, భూమేష్, గణేష్ ఉన్నారు.

వికలాంగులకు బస్‌పాసులు పంపిణీ

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అర్హులైన వికలాంగులకు ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మోపాల్ మండలానికి చెందిన అర్హులైన వికలాంగులకు బస్సు పాసులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, కమల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే డిక్లరేషన్‌ను ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసి తీరుతామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రూ.రెండు లక్షల ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తామని మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఇందల్‌వాయి మండలంలోని అమ్సన్‌పల్లిలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని, వృద్ధులు, వితంతువులకు రూ.4000 పెన్షన్, నెలకు 4000 చొప్పున రూ.25వేల పెన్షన్ కుటుంబంలో ఒకరికి, ఇందిరమ్మ ఇంటికి 5 లక్షల సహాయం, ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా 5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స, వెనుకబడిన వర్గాల ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకే విద్యార్థులందరికీ ఫీజు రియింబర్స్మెంట్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, ఇందల్‌వాయి మండలాధ్యక్షులు మోత్కూరి నవీన్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

34వ రోజుకు జీపీ కార్మికుల సమ్మె

- సమ్మెకు పలువురు మద్దతు

నవతెలంగాణ-ఎడపల్లి



ఎడపల్లి : కుక్కకు వినతిపత్రం అందజేత..

జీపీ కార్మికుల సమ్మె 34వ రోజుకు చేరింది. కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కుక్కకు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని మెడలో వేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దాల్మల్కా పోశెట్టి, మండల కో కన్వీనర్ గంగరాజు, కుంట సంతోష్, మండల అధ్యక్షులు రాజు, స్వామి, మహేష్, పండరి, కిషన్, లక్ష్మణ్, ప్రవీణ్, రాజమణి, లక్ష్మి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు సీపీఐ(ఎం) మద్దతు..

భీంగల్ : తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మంగళవారం సీపీఐ(ఎం) వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంఘీబావం తెలిపారు. 34 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహ రించడం సరికాదని కనుక ఇప్పటికైనా స్పందించి వారి సమ స్యలను పరిష్కరించాలని మండల నాయకుడు గోవర్దన్ కోరారు. ఈ సమ్మెలో గుర్రపు రాజేశ్వర్, బాలయ్య నాగం రాజన్న, కార్మికులు వసుల ముత్తెన్న, ప్రశాంత్, గంగనర్స య్య, శివ, గంగాధర్, గంటమహిపాల్, రమేష్, సునిత, గంగలక్ష్మి తదితరులున్నారు

వాంట వార్పుతో నిరసన

పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా 34వ రోజు వంటావార్పుతో నిరసన చేపట్టారు. ప్రభుత్వం తమ సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

బోధన్ : జీపీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఈ సమ్మెలో కార్మికులు రాజు, సరిడే గంగారం, పోశెట్టి, గౌతం, సరిడే రాము, కూనే శంకర్, ధమ్మన్ గావ్ మరయ్య తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మెకు బీడీ కార్మికుల మద్దతు

ఆర్మూర్ : పట్టణంలో జీపీ కార్మికుల సమ్మెకు మద్దతుగా బీడీ కార్మికులు మంగళవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. సఫాయి కార్మికులే 34 రోజులుగా సమ్మె చేస్తున్నా కనిపించడం లేదా అని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ ప్రశ్నించారు. పట్టణంలో ఉర్దూషాదీ కానా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వీధి వర్గస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఐఎఫ్‌టీయూ నాయకులు కాజాబాయ్, చిట్టక్క, సీఐటీయూ నాయకులు కుతాడి ఎల్లయ్య, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు బుజ్జి, మనెమ్మ, విజయ, నీలా, రాధా తదితరులు పాల్గొన్నారు.

పశువులకు తప్పకుండా టీకా వేయించాలి

నవతెలంగాణ-విలేకరుల బృందం

కమ్మర్‌పల్లి : ప్రతి పశువుకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలని మండల పశువైద్యాధికారి రాజశేఖర్ రావు అన్నారు. మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ నరేందర్, పశువైద్య సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ ప్రవీణ్‌రెడ్డి, హెచ్‌ఏ స్వప్న, ఓఎస్ జమీల్, గోపాలమిత్ర స్వరన్, పశుమిత్రలు, యజమానులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : గాలికుంటు టీకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ తెలిపారు. మంగళవారం ఇందల్‌వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ మందులు, నట్టల నివారణ మందులు వేసి పశువులకు ట్యాగ్ వేసినట్టు ఇందల్‌వాయి మండల పశువైద్యాధికారి గంగాప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత దాస్, ఉప సర్పంచ్ ప్రకాష్, సీనియర్ నాయకులు అరటి రఘు, సంజీవ్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షులు పొన్న భూమయ్య, దేవగౌడ్, కిష్టయ్య, మురళి, ఆశన్న, మల్లయ్య, పెద్దబాలయ్య, నర్సయ్య, శ్రీధర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : హాసకొత్తూర్‌లో టీకాలు..

రెంజల్ : మండలంలోని దూపల్లి గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను అందజేసినట్టు డాక్టర్ విట్టల్ పేర్కొన్నారు. ఈ గ్రామంలో గేదెలు, ఆవులు, దూడలకు కలిపి సుమారు 300 పశువులకు వ్యాధి నివారణ టీకాలను అందజేశారు. కార్యక్రమంలో శశిరేఖ, పుష్ప, నవీన్, గోపాల్ మిత్ర యశ్వంత్, రైతులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : పోతంగల్ మండలంలోని దోమలేడ్గి గ్రామంలో 150 పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను డాక్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. సీజనల్ వ్యాధుల రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు అందజేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయరాణి, నాయకులు దిగంబర్ పటేల్, పశువైద్యులు సుధీర్ గౌడ్, గోపాలమిత్ర తుకారాం, పశుపెంపకందారులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-మాక్లూర్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అధిక వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తహశీల్దార్ శంకర్‌కు తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కురిసిన అధిక వర్షాలకు మాక్లూర్ మండలంలో దాదాపు 2950 ఎకరాల్లో పంటలు నీటమునిగాయని తెలిపారు. కొన్ని చోట్ల ఇసుక మేటలు పడ్డాయని, దీంతో చిన్న సన్నకారు రైతులు దీనాస్థితిలో ఉన్నారన్నారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం తక్షణం ఎకరాకు రూ.20 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధిక వర్షాలకు, వరదలకు జిల్లా వ్యాప్తంగా 70వేల కుండపోతగా ఎకరాల్లో పంటలు మునిగిపోయాయని ప్రభుత్వం యుద్ధ ప్రతిపాదికన జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన పంటలకు ఆహార ధాన్యాలు అయితే ఎకరాకు రూ.10 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.20వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధిక వర్షాలు, వరదల వలన వరి, మొక్కజొన్న, కూరగాయలు, పంటలు మునిగి పోయాయని అన్నారు. రాష్ట్రంలో పంటల బీమా లేకపోవడం వల్ల రైతులకు భరోసా లభించడం లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు జరిగిన నష్టాలపై అంచనా వేసి కేంద్ర బృందాన్ని పిలువాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన నష్టాలకు పరిహారం చెల్లించడానికి 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సాయిలు, కిషన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు తీసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్వయం సహాయక సంఘాలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్, రీజినల్ హెడ్ మేనేజర్ శేంకర్ హయ్‌రాం తెలిపారు. ఇందల్‌వాయి మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా స్వయం సహాయక సంఘాల రుణా మేళాకు వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ద్వారా రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళా సంఘాలకు ఒక్కో గ్రూపునకు 20 లక్షల రూపాయల చొప్పున యూనియన్ బ్యాంక్ తరపున ఎలాంటి డాక్యుమెంట్ లేకుండా రుణం పొందే వీలుంటుందని, క్రమం తప్పకుండా బ్యాంకులో ప్రతినెల చెల్లించవలసిన రుణాలను చెల్లిస్తూ బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇదే కాకుండా బ్యాంకులలో తక్కువ డబ్బులతో బీమా చేసుకునే సదుపాయం ఉందని అన్నారు. ఏజీఎం శివ కోటయ్య మాట్లాడుతూ పదిమంది సంఘటితంగా ఉండి మహిళ సంఘంలో ప్రతి గ్రూపునకు సీనియారిటీ ప్రకారంగా యూనియన్ బ్యాంకు నుంచి రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. డ్వాక్రా సంఘాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీఏలకు శాలువా బహుమతులతో సన్మానించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇందల్‌వాయి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్ ప్రశాంత్, ఆర్డీఓ విశాల్ పావర్, అనురాధ, మోతీరాం, ఉదయ్ పాల్గొన్నారు.



రుణాలు పంపిణీ చేస్తున్న అధికారులు

నిరుపేద విద్యార్థికి ఎమ్మెల్సీ కవిత ఆర్థిక చేయూత

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిరుపేద సరస్వతి పుత్రునికి ఎమ్మెల్సీ కవిత చేయూతను అందించారు. విదేశాలలో ఉన్నత విద్యకు ఆర్థిక ఆటంకం ఏర్పడిన యువకుడికి భరోసా కల్పించారు. నగరానికి చెందిన సామల రితీష్‌కు అమెరికాలోని నార్త్ వెస్ట్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ సీటు లభించింది. కానీ చిన్న ఉద్యోగం చేస్తూ తన కుటుంబాన్ని పోషించే రితీష్ తండ్రి అమెరికాకు తన కొడుకుని పంపించే స్తోమత లేక ఇబ్బందుల పాలయ్యారు. ఈ విషయాన్ని రితీష్ ఎమ్మెల్సీ కవితకు తెలియజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ కవిత రితీష్ అమెరికాకు వెళ్లడానికి అవసరమయ్యే ఖర్చులను భరించారు. వారికి టికెట్‌ను సొంత ఖర్చులతో ఇప్పించారు. తన కలను సాకారం చేసుకునేందుకు ఆర్థిక చేయూత అందించి అండగా నిలబడిన ఎమ్మెల్సీ కవితకు రితీష్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

చేనేత పద్మశాలి కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత పద్మశాలి కార్మికులు మాటేటి సత్యనారాయణ, అవదుత అరుంధతి, అంబటి గోదావరిని పద్మశాలి సంక్షేమ సేవాసమితి ఆర్మూర్ అధ్యక్షులు మ్యాక మోహన్ దాస్, రాజారాంనగర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు రుద్ర రాజేశ్వర్, సర్వసమాజ్ పద్మశాలి ప్రతినిధి చక్రి, పట్టణ పద్మశాలి కమిటీ సభ్యులు అందె నాగేశ్వర్‌రావు, పొన్న శంకర్ మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా సంక్షేమ సేవ సమితి అధ్యక్షులు మ్యాక మోహన్ దాస్ మాట్లాడుతూ చేనేత పరిశ్రమను బలోపేతం చేయాలని, ఆర్థిక సహాయం అందించాలని, ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమలను, ముఖ్యంగా చేనేత కార్మికులకు సహాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కంచుకోట.. ఆర్మూర్

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ కంచుకోట అని మాజీ అధికార ప్రతినిధి మార చంద్రమోహన్ అన్నారు. అధ్యక్షులు సాయిబాబాగౌడ్ అధ్యక్షతన మంగళవారం పట్టణ, మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ అధికార ప్రతినిధి మార చంద్రమోహన్, పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మార చంద్రమోహన్ మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ అరవింద్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇక్కడ కుస్తీ హైదరాబాద్‌లో దోస్తీ చేస్తూ 5 స్టార్ హెూటల్లో మీటింగ్‌లు పెట్టుకుంటూ పార్టీలు చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని గెలవకుండా ఒక్కటయ్యాయని ఆరోపించారు. రానున్న ఎన్నికలో అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పనిచేసి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేద్దామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబాఖాన్, గంగాధర్‌గౌడ్, విట్టం జీవన్, వెంకట్రాంరెడ్డి, మీర్ మాజీద్, రాజేశ్వర్, ముక్కెర విజయ్, భూమేశ్వర్, చిన్నారెడ్డి, రవి ప్రకాష్, మహమూద్ అలీ, ప్రమోద్, మంథని చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో కోరుట్ల బహిరంగ సభ గోడప్రతుల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్‌టౌన్/కమ్మర్‌పల్లి

సంఘటితం, సమానత్వం, రాజ్యాధికార సాధన కోసం ఈ నెల 13న జరిగే ఛలో కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధభేరిలో పాల్గొని పద్మశాలీల సత్తా చాటుకోవాలని పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులగం హనుమాండ్లు పిలుపునిచ్చారు. బోధన్ నియోజకవర్గ పద్మశాలి సమావేశాన్ని తట్టికోట్ పద్మశాలి భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : పద్మశాలి సంఘం సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు చింత తిరుపతి అధ్యక్షతన నిర్వహించి చలో కోరుట్ల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడ్డ బాల్కొండ నియోజకవర్గ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పోతు ధరణి కుమార్, కమ్మర్‌పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు చింత శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు.

తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సిలివేరి శంకర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సిలివేరి శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ శంకర్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. తెలంగాణ చేనేత ఐక్య వేదిక ద్వారా కార్మికుల పరిరక్షణ కోసం వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా వీరమోహన్ శంకర్‌కు సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై పరిశీలన

నవతెలంగాణ-నవీపేట్



పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై తహసీల్దార్ ధన్వల్, ఎస్సై యాదగిరి గౌడ్ మంగళవారం పరిశీలిం చారు. మండలంలోని పోతంగల్, హనుమాన్‌ఫారం, గాంధీనగర్, జన్నేపల్లి, నారాయణపూర్, సిరన్‌పల్లి, లింగాపూర్, నిజాంపూర్, తుంగిని, నాలేశ్వర్, బినోల, ఆశజ్యోతి కాలనీ గ్రామాలలో ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసే కేంద్రాల్లో విద్యుత్ మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలపై రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ మోహన్, వీఆర్ఏలున్నారు.

పాఠశాలల్లో 'అబాకస్ డే'

నవతెలంగాణ-నందిపేట్/ఆర్మూర్



నందిపేట్ : నియోలిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో

మండల కేంద్రంలోని నియోలిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో అబాకస్ డేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ అబాకస్ వల్ల కచ్చితత్వం, బ్రెయిన్ డెవలప్మెంట్, ఆలోచన, స్వీయ ఆలోచన వల్ల జరిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అరుణ్, ప్రధానోపాధ్యాయులు రవికిరణ్, ప్రైమరీ పాఠశాల అఖిల, అబాకస్ హరిత తదితరులు పాల్గొన్నారు.

ఫోటోతో పెట్టండి

జెంటిల్ కిడ్స్ పాఠశాలలో ప్రపంచ అబాకస్ దినోత్సవం..

ఆర్మూర్ : పట్టణంలోని జెంటిల్ కిడ్స్ పాఠశాలలో ప్రపంచ అబాకస్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల యజమాన్యం అబాకస్ అనునది కచ్చితంగా అంక గణిత సంఖ్యలను చేసే సాధనం అని, దీనిని ఉపయోగించి సంఖ్య శాస్త్రంలోని ప్రాథమిక విధానాలైన కూడిక, తీసివేత, గుణకారం, బాగాహారం చేయడానికి ఉపయోగించబడిన ప్రథమ స్థానమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రవాణ రంగ కార్మికులకు సామాజిక బోర్డును ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రవాణ రంగ కార్మికులకు సామాజిక బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆల్ డ్రైవర్స్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు కటారి రాములు మాట్లాడుతూ.. ఆర్టీఏ అధికారులు, పోలీసుల వేధింపులు ఆపాలని, థర్డ్ పార్టీ ప్రీమియం ఇన్సూరెన్స్ డబ్బులు, ఫిట్నెస్ చార్జీలను తగ్గించాలని, ప్రభుత్వమే షరతులు లేకుండా ఆటోలను టాక్సీలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కో కన్వీనర్ ద్యారాంగుల కృష్ణ, ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు కృష్ణ పండరి, ముజీబ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి రూ.10లక్షలు ఇవ్వాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గృహలక్ష్మి పథకానికి రూ.10లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి తారక రామారావుకు బహిరంగ లేఖ ద్వారా ప్రజా సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు పి.హనుమండ్లు, ఆనంద్, ఫయీముద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అందరూ పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి అన్నారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సుంకెట రవి ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా శ్రీరాముల మురళి, గోపిడి లింగారెడ్డి, చెంగల అశోక్, కొమ్ముల రవీందర్, వన్నెల రాజేశ్వర్, నేరెళ్ల రమేష్ గౌడ్, కోశాధికారిగా బుచ్చి మల్లయ్య, ప్రధాన కార్యదర్శులుగా పుప్పాల నరసయ్య, పడాల మల్లేష్, వన్నెల దేవేందర్, చింతకుంట శ్రీనివాస్, సుంకెట శ్రీనివాస్, జంగం అశోక్, మండల శేఖర్, మెట్టు రాజ గంగారం, చెప్పాలా గంగారాజం, మహేందర్ గౌడ్, సూర స్వామి, సభ్యులుగా బీర మల్లయ్య, ఎర్ర గంగాధర్, రావుట్ల గంగాధర్, జక్కుల రాజన్న, కుమ్మరి లింబాద్రి, కాటిపల్లి రంగయ్యను ఎన్నుకున్నారు.